క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజినీ వైద్య పరీక్షలు చేశారు. 15 రోజులకు సరిపడా మందులను ఉచితంగా రోగులకు పంపిణీ చేశారు. దాతలు నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక సాయంతో ఈ శిబిరం నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

కొండలమ్మకు మొక్కులు తీర్చుకున్న భక్తులు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. తొలుత పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా నృసింహ జయంతి



జుఝవరం(పామర్రు): మండలంలోని జుఝవరంలో స్వయంభుగా వేలసిన శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు రొంపిచర్ల సాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బడ్డీ కొట్టు అందజేత



పమిడిముక్కల: మండలంలోని మంటాడ రెడ్డిపాలేనికి చెందిన పేద కార్యకర్త దారపు రమాదేవి జీవనోపాధి నిమిత్తం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ బడ్డీ కొట్టును అందజేశారు. ఈ బడ్డీని వైఎస్సార్ సీపీ నాయకులు కంభపు రాంబాబు ఆదివారం ప్రారంభించారు. కార్యకర్తలకు అనిల్‌కుమార్ ఎల్లవేళలా అండగా నిలుస్తారని రాంబాబు పేర్కొన్నారు. కైలే అనిల్‌కుమార్‌కు రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంభపు లక్ష్మయ్య, కాగితాల కనకరావు, చల్లా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మన దేశ సైనికుల సంక్షేమం కోసం పూజలు



గుడివాడ టౌన్: భారతదేశ సరిహద్దు గ్రామాల ప్రజలు, దేశంకోసం పోరాడుతున్న సైనికులు క్షేమంగా ఉండాలని ఆదివారం స్థానిక పెద్ద కాల్వ సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ సరిహద్దుల్లో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి దేశాన్ని రక్షిస్తున్న సైనికులకు ఆంజనేయ స్వామి మరింత ధైర్యాన్ని, బలాన్ని ఇవ్వాలని ఈ పూజలు నిర్వహించినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బి.గోపిక, కె.కిరణ్, రీటా తదితరులు పాల్గొన్నారు.

చెరువులా తాడంకి అండర్‌పాస్



పమిడిముక్కల: తాడంకి అండర్‌పాస్ చెరువులా మారంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అండర్‌పాస్ వద్ద భారీగా నీరు నిలిచింది. నీరు పోయేందుకు అవకాశం లేకపోవడంతో రోజుల తరబడి నిలిచి ఉంటోంది. ఈ ప్రాంతంలో రెండు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. అండర్‌పాస్ జలమయం కావడంతో గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యను పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తాడంకి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అండర్‌పాస్ వద్ద నీరు నిలవకుండా డ్రెయిన్లు నిర్మించాలని నేషనల్ హైవే అధికారులను కోరుతున్నారు.

గుంతలమయంగా రోడ్లు..
ప్రయాణికుల అవస్థలు



గుంతలమయంగా మారిన వీరంకిలాకు-కూచిపూడి రోడ్డు



అధ్వానంగా మారిన కృష్ణాపురం-ఐలూరు రోడ్డు

పమిడిముక్కల: మండలంలోని పలు రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వీరంకిలాకు-అగినపర్రు, కృష్ణాపురం-కూచిపూడి, కృష్ణాపురం-ఐలూరు రోడ్లు గుంతలు పడి, రాళ్లు లేచి ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం వస్తే గుంతల్లో నీరు చేరి రహదారులు కనిపించని పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. దగ్గరి దారి కావడంతో వాహనదారులు కూచిపూడి నుంచి అగినపర్రు మీదగా వీరంకిలాకు వచ్చి ఉయ్యూరుకు వెళుతుంటారు. అదేవిధంగా మచిలీపట్నం వైపు నుంచి వచ్చే వారు కూచిపూడి నుంచి ఐలూరు వెళ్లి కరకట్ట మీదగా విజయవాడకు వెళుతుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్లు ఇసుక టిప్పర్ల తాకిడితో పూర్తిగా దెబ్బతిన్నాయి. గత కొన్నేళ్లుగా ఈ రహదారులను అభివృద్ధి చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా ప్రయోజనం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మిగిలిన రోడ్ల పరిస్థితీ అంతే..

వీరంకిలాకు-ఫత్తేలంక, కృష్ణాపురం-గొడపాలెం, కూడేరు-ఐనపూరు రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. వీరంకిలాకు నుంచి వీరంకి, అమీనపురం, ఫత్తేలంక గ్రామాల వరకు ఉన్న రహదారి పూర్తిగా పాడైపోయింది. ఆయా గ్రామాల ప్రజలు ప్రతి పనికీ వీరంకిలాకు రావాల్సి ఉంది. కృష్ణాపురం నుంచి గొడపాలెం రోడ్డు కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారింది. అధిక లోడుతో లారీలు వెళ్లడంతో ఈ రోడ్డు దెబ్బతింది. రోడ్డుపై మట్టి పేరుకుపోవడం వలన రాకపోకలు సాగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



గొడపాలెం రోడ్డు దుస్థితి

రహదారుల అభివృద్ధికి చర్యలు

మండలంలోని రహదారుల అభివృద్ధికి అంచనాలు రూపొందించి నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– మల్లికార్జునరావు, ఆర్‌అండ్‌బీ, ఏఈ

రహదారుల పరిస్థితి దారుణం



కృష్ణాపురం నుంచి కూచిపూడి, ఐలూరు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కూచిపూడి, ఐలూరు వెళ్లాలంటే కష్టంగా ఉంది. ఇసుక టిప్పర్ల వల్ల రోడ్డంతా దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రహదారులకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలి.

– అల్లూరి సాంబశివరావు, కృష్ణాపురం

బురదమయంగా గొడపాలెం రోడ్డు



గొడపాలెం రోడ్డంతా బురదమయంగా మారింది. ద్విచక్ర వాహనాలు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. నడిచి వెళ్లేందుకు కూడా కష్టంగా ఉంది. రహదారి సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డును బాగు చేయాలి.

– కాగిత వెంకటేశ్వరరావు, గొడపాలెం

ఫత్తేలంక రోడ్డుకు మరమ్మతులు చేయాలి

వీరంకిలాకు నుంచి వీరంకి మీదగా ఫత్తేలంక రోడ్డు గుంతలయంగా మారింది. మూడు గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరం. ఈ రహదారి కృష్ణా కరకట్టకు దగ్గరిదారి కావడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలి.

– పరసా శ్రీను, వీరంకి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గుడివాడరూరల్: చెడు ప్రవర్తన కలిగిన వారు తమ తీరు మార్చుకుని నేరాలకు దూరంగా జీవించాలని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, గొడవలు, మద్యం అక్రమ అమ్మకాలు, కోడి పందేలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయాల్లో కొనసాగుతున్న వార్షికోత్సవాలు



గుడ్లవల్లేరు: కౌతవరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ దేవస్థానం, శ్రీ గంగా పార్వతీ సమేత సిద్ధేశ్వరాలయం, గుడ్లవల్లేరు శ్రీ రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయాల వార్షికోత్సవ వేడుకలు ఆదివారం కొనసాగాయి. ఈ వార్షికోత్సవాల్లో భాగంగా వేద పండితులు బలిహరణ, ధ్వజారోహణ, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలను వేద మంత్రోచ్చరణ నడుమ నిర్వహించారు. అలాగే వెణుతురుమిల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ కోదండ రామస్వామి ఆలయాల ఉత్సవాల్లో భాగంగా నిత్యోపాసన, బలిహరణ, రాయభారోత్సవ కార్యక్రమాలను వేద పండితులు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు.

సుబ్బారాయుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సామూహిక పఠనంతో విషయ పరిజ్ఞానం



జమీగొల్వేపల్లిలో సామూహిక పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు, పాఠకులు



పామర్రులో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ముదినేపల్లి గ్రంథాలయంలో విద్యార్థుల పుస్తక పఠనం



మండవల్లి గ్రంథాలయంలో డిక్టేషన్ కండక్ట్ చేస్తున్న దృశ్యం

పామర్రు: సామూహిక పఠనా కార్యక్రమం(మాస్ రీడింగ్)తో విషయ పరిజ్ఞానం, సామాజిక స్పృహ కలుగుతుందని గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం సామూహిక పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాన సముపార్జనకు సరైన మార్గం గ్రంథ పఠనం అని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న నాటి నుంచే గ్రంథాలయానికి రావటం అనేది ఒక అలవాటుగా మార్చుకోవాలన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం మెడిటేషన్‌పై అవగాహన కల్పించామని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి తెలిపారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: పెదపారుపూడిలోని గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనం అంశంపై గ్రంథాలయాధికారి ఎంవీఎస్ లక్ష్మీ అవగాహన కల్పించారు. విద్యలో రాణించేందుకు మొదటి మెట్టు పుస్తకం పఠనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులతో ఆదివారం పుస్తక పఠనం చేయించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతికథల పుస్తకాలు అందజేశారు. అనంతరం పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

మండవల్లిలో..

మండవల్లి: వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన కోరారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పిల్లలకు డిక్టేషన్ కండక్ట్ చేశారు. అనంతరం వారికి బేసిక్ కంప్యూటర్స్‌పై అవగాహన కల్పించారు.

పెండ్లి కుమారుడిగా సోమేశ్వరస్వామి



స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరిస్తున్న అర్చకుడు

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు శ్రీపార్వతీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్వామిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. తొలుత విఘ్నేశ్వర పూజ, పంచగవ్యం, దీక్షధారణ, ధ్వజారోహణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రాత్రి పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దివ్యకల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

రమణీయం.. వేణుగోపాలస్వామి కల్యాణం



పామర్రులో వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

పామర్రు: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి కడు రమణీయంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో విశ్వక్సేణ పూజ, పుణ్యాహ వచన, మండపారాధన, నవగ్రహపూజ, కలశస్థాపన, కంకణ పూజ, కంకణధారణ నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు సుముహూర్తం జీలకర్ర బెల్లం పెట్టించారు. తదుపరి మాంగల్యధారణ అక్షతారోహణం చేశారు. మేళ తాళాలతో వేద మంత్రాలతో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు, సిబ్బంది కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు జీవిత బీమా

అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

గుడివాడరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఇప్పటి వరకు జీవిత బీమా సౌకర్యం లేదు. ఈ నేపథ్యంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి బీమా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో 34,677 మందికి కూలీలకు బీమా సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎఫ్‌ఏ లేదా మేట్లు అందజేసే దరఖాస్తుపై కూలీలు సంతకం పెట్టి అప్పగిస్తే బ్యాంక్ ఖాతాల నుంచి ప్రీమియం మినహాయించుకుంటారని అధికారులు తెలిపారు.

రెండు రకాలుగా..

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన కింద బీమా భరోసాను కల్పించాలని కార్యాచరణ రూపొందించింది. మొదటి బీమా ప్రీమియం కింద ఏడాదికి రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. ప్రమాదవశాత్తు కూలీ మృతి చెందితే రూ.2 లక్షలు ఇస్తారు. రెండో దానికి సంబంధించి ప్రీమియం రూ.436 చెల్లించాలి. సహజ మరణం లేదా ప్రమాదం జరిగి మృతి చెందితే రూ.2 లక్షలు ఇస్తారు.

కూలీలకు ఉపయోగం

ప్రస్తుతం మండుతున్న ఎండల కారణంగా రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. కూలీల్లో వయస్సు మళ్లిన వారు, ఆరోగ్య సమస్యలున్న వారు ఉంటారు. వడదెబ్బ ప్రభావం, ఇతర కారణాలతో మృతి చెందితే బీమా సౌకర్యం వర్తిస్తుంది. ఫలితంగా వారి కుటుంబాలకు నగదు సాయం ఆసరాగా ఉంటుందని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. యుద్ధప్రాతిపదికన జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీ బీమా ప్రీమియం చెల్లించాలని కోరుతున్నారు. రెండు రకాల సౌకర్యాలను కూలీలు పొందాల్సిందిగా సూచిస్తున్నారు. ఇప్పటికే దీనిపై మండలాల్లో సమావేశాలు పెట్టి అవగాహన కల్పిస్తున్నారు.

బీమా సౌకర్యం పొందాలి

జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలు విధిగా బీమా సౌకర్యం పొందాలి. బ్యాంక్ ఖాతాల నుంచి ప్రీమియం మినహాయించుకుంటారు. ఎవరికీ నేరుగా నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ప్రతి ఒక్క కూలీ సద్వినియోగం చేసుకోవాలి.

– రామకృష్ణ, ఉపాధిహామీ ఏపీఓ

సంక్షిప్త వార్తలు

బుద్ధుడి బోధనలు ఆచరించాలి

మండవల్లి: బుద్ధుని బోధనలను ప్రతిఒక్కరూ ఆచరించాలని అంబేడ్కర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సామాజిక కార్యకర్త ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. 12వ తేదీ గౌతమ బుద్ధుని జయంతి పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో శాంతి, సహనం, సమానత్వం కోసం నేటి యువత బుద్ధ భగవానుని బోధనలను ఆచరించాల్సిఅవసరం ఉందన్నారు.

పోలీసుల శ్రమదానం



కైకలూరు: అధ్వానంగా మారిన జాతీయ రహదారిపై గుంతలను పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా మరమ్మతులు చేయించారు. పామర్రు-దిగమర్రు(165) జాతీయ రహదారిపై సంత మార్కెట్ వద్ద రహదారి పూర్తిగా దెబ్బతింది. అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పట్టణ సీఐ పి.కృష్ణ, ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ దగ్గరుండి రోడ్డు వేయించారు.

ఘనంగా గంగానమ్మ ఆలయ వార్షికోత్సవం

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని శ్రీ గంగానమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కొసరాజు వంశీయులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక జలాభిషేకం చేశారు. అనంతరం పొంగళ్లు వండి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సుమారు మూడు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విఘ్నేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట



మండవల్లి: మండలంలోని పెరికెగూడెం ఆది విఘ్నేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు శనివారం రాత్రి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు బెనర్జీకి సాహితీ రత్న బిరుదు



కైకలూరు: ఏలూరులో జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో కైకలూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సహజ కవి దండే బెనర్జీని సాహితీ రత్న బిరుదుతో సత్కరించారు. మరిన్ని సామాజిక శీర్షికలతో రచనలు చేయాలని నిర్వాహకులు కోరారు.

వేసవి దుక్కులు ప్రారంభం



ట్రాక్టరుతో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

పామర్రు: మండలంలో పలుచోట్ల రైతులు వేసవి దుక్కులను ప్రారంభించారు. రబీ పంటల తర్వాత మెట్ట, మాగాణి, బీడు భూముల్లో లోతు దుక్కులు దున్నుకోవాలి. వీటినే వేసవి దుక్కులు లేదా ఎండు దుక్కులు అని కూడా అంటారు. ఈ దుక్కులను 25-30 సెంటీమీటర్ల లోతు వరకూ దున్నాలి. ఇలా చేయడం వలన భూమిలోని గడ్డి పొరలు చీలిపోతాయి. అధిక వర్షాల సమయంలో గుల్లబారి నీరు ఇంకిపోతుంది. నేలలో నీటి నిల్వల సామర్థ్యం పెరుగుతుంది. భూమి లోపల పొరల్లోని కలుపు విత్తనాల వేర్లు బయటపడి వేసవిలోని అధిక ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. అలాగే సేంద్రియ పదార్థాల లభ్యత పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. పచ్చిరొట్ట పంటలు రబీ పంట అనంతరం లేదా వేసవి దుక్కుల తర్వాత నీటి వసతిని బట్టి పెసర, మినుము పంటలను సాగు చేసుకోవచ్చు. లేదా పిల్లి పెసర, జనుము వంటి పైర్లను సాగు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు .

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com